
నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I హైదరాబాద్, శుక్రవారం 9 మే 2025 RANGAREDDY

భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో నగరంలో హై అలర్ట్ కొనసాగుతుంది. సిటీలో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యారు. మతపరమై ప్రదేశాలు, ప్రార్థన మందిరాలు, ప్రభుత్వ కార్యాలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పోలీసు బలగాలతో పాటు ఇంటెలిజెంట్, స్పెషల్ బ్రాంచ్, డాగ్ స్క్వాడ్ తదితర విభాగాలు రంగంలోకి దిగాయి. సున్నిత మైన ప్రాంతాల్లో భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. సీసీ కెమెరాలు పనిచేసేలా 24/7 మానిటరింగ్ చేస్తున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, గచ్చిబౌలి స్టేడియం, ఐటీ కారిడర్, హైటెక్ సిటీపై స్పెషల్ ఫోకస్ పెట్టారు.



# డ్రోన్ హబ్‌గా సిటీ

## దేశ రక్షణలో కీలక భూమిక

- అధునాతన సాంకేతికతకు వేదిక
- టెక్నాలజీతో శత్రువుల ఆట కట్టు
- ఉగ్ర మూకలను అంతమొందించేందుకు ఉపయోగం

'సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ) : యూరీ ఘటనకు బదులుగా 2016 సెప్టెంబర్‌లో భారత బలగాలు చేసిన సర్జికల్ స్ట్రయిక్‌లో డ్రోన్లు అత్యంత కీలకపాత్రను పోషించాయి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే మానవ రహిత డ్రోన్లను పాక్ ఉగ్ర స్థావరాల్లోకి సైన్యం తీసుకెళ్లింది. డ్రోన్ల ద్వారా సేకరించిన భౌగోళిక సమాచారం ఆధారంగా సునాయాసంగా చేరుకుని, ఉగ్రమూకలను తుద ముట్టించారు. దీనికి డ్రోన్లు అందించిన సమాచారమే కీలకం కాగా, హైదరాబాద్ ఇప్పుడు రక్షణ రంగానికి అవసరమైన డ్రోన్లను అందించే వేదికగా నిలిచింది. పదుల సంఖ్యలో సిటీ కేంద్రంగా అధునాతన ఆవిష్కరణలు పురుడు పోసుకోవడంతో పాటు దేశ రక్షణలోను కీలక పాత్రను పోషించే స్థాయికి ఎదిగాయి.

### అధునాతన సాంకేతికత వినియోగం..

గడిచిన ఐదేండ్లలో తెలంగాణలో డ్రోన్ల తయారీ, వినియోగం క్రమంగా పెరుగుతున్నది. ఈ క్రమంలో యూఏవీ డ్రోన్లకు రూపకల్పన చేసే హబ్‌గా హైదరాబాద్ నిలుస్తున్నది. రక్షణ రంగానికి అవసరమైన అన్ని రకాలను డ్రోన్లతో వ్యూహాత్మక దాడులు చేసే స్థాయిలో అధునాతన సాంకేతికతను వినియోగిస్తున్నాయి. ఇందులో సెక్ ధ్రువాన్ ఇన్నోవేషన్ సంస్థ చేసే గాల్లో ఉండే డ్రోన్లను లక్ష్యంగా దాడులు చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అదే విధంగా గ్రేన్ రోబోటిక్ అనే సంస్థ తయారు చేసిన ఇంద్రజాల్ యాంటీ డ్రోన్ వ్యవస్థ ద్వారా విస్తృత పరిధిలో యూఏవీ కౌంటర్ అటాక్ చేయగలుగుతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేస్తూ శత్రువు ఆయుధాలను గాల్లో కలిపేస్తుంది. ఈ అధునాతన వ్యవస్థ ద్వారా డ్రోన్ అటాక్‌లకు వజ్రకవచంలా నిలువరిస్తాయి. ఇక జేఎస్‌డబ్ల్యూ డిఫెన్స్ అనే సంస్థ అమెరికా ఆధారిత రక్షణ రంగానికి చెందిన కంపెనీతో కలిసి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో దూసుకుపోయే డ్రోన్లను ఉత్పత్తి చేస్తున్నది. జెన్ టెక్, రేడాన్ సిస్టం అనే స్టార్టప్‌లు రూపొందించిన డ్రోన్ టెక్నాలజీ అన్నింటికీ వైవిధ్యంగా ఉండడంతోపాటు, ఎలాంటి డ్రోన్లనైనా ముందుస్తుగానే పసిగట్టేస్తున్నది. దీంతోపాటు గరుడ ఎయిరోస్పేస్ అనే సంస్థ కూడా డ్రోన్ల తయారీలో కీలకంగా వ్యవహరిస్తూ రక్షణ రంగానికి అవసరమైన ఆయుధాలను అందించే స్థాయిలో ఆవిష్కరణల్లో దూసుకుపోతున్నది.

### శత్రు దాడులను పసిగట్టి..

దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో కంటే హైదరాబాద్ ఏకో సిస్టమ్ బలోపేతంగా ఉంది. గడిచిన పదేళ్లలో తెలంగాణ వ్యాప్తంగా అందుబాటులోకి పారిశ్రామిక విధానం అధునాతన ఆవిష్కరణలకు కారణమైంది. ఇలా ఆపత్కాలంలో శత్రు మూకలను తరిమికొట్టే ఆయుధ సంపత్తిని అందించే కర్మాగారంగా నిలుస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో కార్యకలాపాలు కొనసాగించే ఎన్నో సంస్థలు అధునాతన యుద్ధ సామగ్రిని ముఖ్యంగా డ్రోన్లు, మానవరహిత గాలి వాహనాలను( యూఏవీ)లను అందుబాటులోకి తీసుకువచ్చాయి. ఈ క్రమంలో హైదరాబాద్ వేదిక ఉన్న ఎన్నో కంపెనీలు అంతర్జాతీయ సంస్థలతో కలిసి అధునాతన ఆయుధాలను అందించే స్థాయికి చేరుకున్నాయి. ఎలాంటి ప్రాణనష్టం లేకుండా శత్రు దాడులను పసిగట్టి, నియంత్రించగలిగే డ్రోన్లు కూడా హైదరాబాద్‌లో జీవం పోసుకుంటున్నాయి.



# హై అలర్ట్

## నగరంలో భద్రత కట్టుదిట్టం

- మతపరమైన ప్రదేశాలపై ప్రత్యేక నిఘా
- సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలి
- సిబ్బందికి ఉన్నతాధికారుల ఆదేశాలు

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో హై అలర్ట్ కొనసాగుతున్నది. భారత్-పాక్ మధ్య పరిణామాల నేపథ్యంలో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. కీలక స్థావరాలు, సైనిక కంటోన్మెంట్లు, ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిఘా పెంచారు. సిటీలో మతపరమైన అల్లర్లు తలెత్తకుండా ముందస్తుగా గతంలో ఇటువంటి అల్లర్లను ప్రోత్సహించిన వారిని గుర్తించి వారిపై కన్నేశారు. పాతబస్తీ, కంటోన్మెంట్, సైదాబాద్, మలక్‌పేట వంటి ప్రాంతాల్లో పోలీసు భద్రత కొనసాగుతున్నది. సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. నగరంలో సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని, కొన్ని సున్నితమైన ప్రాంతాల్లో అనుకూలతను బట్టి ఆయాప్రాంతాల్లో స్థానికుల సహకారం తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ఇప్పటివరకు పాకిస్థాన్ విషయంలో కొంత సానుకూలంగా స్పందించిన వారిని కూడా గుర్తించి వారిపైనా దృష్టిపెట్టినట్లు తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో నగరంలో శాంతిభద్రతలు కాపాడడంతోపాటు యుద్ధవాతావరణం తలెత్తితే ప్రజలు తమను తాము రక్షించుకోవడం, పోలీసుల చర్యలపై ఎప్పటికప్పుడు జోనల్ ఆఫీసర్లతో సీపీ సమీక్ష నిర్వహిస్తున్నారు.

### ప్రార్థనా మందిరాలపై ప్రత్యేక దృష్టి..

నగరంలోని ప్రార్థనామందిరాల వద్ద ఎలాంటి ఘర్షణ వాతావరణం తలెత్తకుండా ముందస్తుగా అన్ని ప్రాంతాల పోలీసులను అలర్ట్ చేశారు.

ముఖ్యంగా మతపరమైన ప్రదేశాల చుట్టూ నిఘా పెంచారు. స్థానిక , డివిజనల్, జోనల్ స్థాయిలోని నైట్ డ్యూటీ అధికారులు రాత్రివేళల్లో తమ ఏరియాల్లోని ముఖ్యమైన ప్రార్థన ఆలయాలను సందర్శించి తనిఖీలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. ఎక్కడైనా ఏదైనా అనుమానాస్పద వస్తువు కనిపిస్తే వెంటనే తొలగించాలని, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ముందస్తు జాగ్రత్తగా మతపరమైన స్థలానికి ఏదైనా నష్టం జరిగితే దానిని వెంటనే సరిదిద్ది అక్కడ ఎలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ విషయంలో లోకల్ అధికారులే కీలక పాత్ర పోషించాలని, ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో టచ్‌లో ఉండాలని, ముఖ్యమైన సమాచారం ఉంటే క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకొని సీపీ వరకు ఎవరికైనా వెంటనే తెలిపేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో మతపరమైన అల్లర్లకు కారణమైనవారు కానీ, అందుకు ప్రేరేపించినవారు, అందులో పాల్గొన్నవారు ఎవరున్నా వారిని గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. సిటీ పోలీసులకు ప్రజలు సహకరించాలని అన్నారు.

# అనుమానితులపై ప్రత్యేక నిఘా

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, గచ్చిబౌలి స్టేడియం, ఐటీ కారిడార్లపై స్పెషల్ ఫోకస్

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): ఒక పక్క ప్రపంచ అందాల పోటీలు.. మరో పక్క భారత్-పాక్‌ల మధ్య యుద్ధవాతావరణం..ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలోనే సైబరాబాద్ పోలీసులు కమిషనరేట్ పరిధిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. భారత్-పాక్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల సందర్భంగా ముందు జాగ్రత్త చర్యగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ కారిడార్‌తో పాటు ఇతర పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సంస్థల వద్ద నిఘా పెంచారు. నగరంలో ఉగ్రమూకలు, వాటి సానుభూతి మూలాలేమైన ఉన్నాయా అనే కోణంలోనూ కేంద్ర, రాష్ట్ర నిఘా సంస్థలు దృష్టి పెట్టాయి. కమిషనరేట్ పరిధిలోని సీసీ కెమెరాలన్నింటినీ 24/7 మానిటరింగ్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, తప్పుడు వార్తలు రాకుండా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రతిరోజూ స్వదేశంతోపాటు వివిధ దేశాలకు చెందిన ప్రయాణికులు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండడంతో ఎయిర్‌పోర్ట్‌తోపాటు దాని పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసు బలగాలతోపాటు నిఘా సంస్థలు, ఇంటెలిజెంట్ విభాగం, స్పెషల్ బ్రాంచ్, బాంబు స్క్వాడ్, క్లూస్ టీమ్స్, డాగ్ స్క్వాడ్, తదితర అన్ని విభాగాలను రంగంలోకి దిగినట్లు సమాచారం. కేంద్ర నిఘా వర్గాల నుంచి ఎప్పటికప్పుడు వస్తున్న హెచ్చరికలు, సమాచారంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమవుతూ, విపత్కర పరిస్థితులు ఎదురైతే అవలంబించాల్సిన చర్యలపై వ్యూహరచన చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

### ఐటీ కారిడార్ వద్ద..

వందల సంఖ్యలో ఐటీ కంపెనీలు ఉన్న గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ తదితర ఐటీ కారిడార్‌పై నిఘా వర్గాలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. కారిడార్ మొత్తాన్ని భద్రతాపరంగా క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఎలాంటి విపత్తులు ఎదురైనా సమర్థంగా ఎదుర్కొనేలా భద్రతా బలగాలు అన్నిరకాల ముందస్తు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

### అందాల పోటీల నేపథ్యంలో..

ప్రపంచ అందాల పోటీల నేపథ్యంలో వివిధ దేశాల నుంచి వచ్చిన అందాల భామలు బస చేసే హోటళ్లు, వారు పర్యటించే ప్రాంతాలు, ప్రయాణించే మార్గాల్లో సైతం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పోటీలు జరిగే గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



## సక్రమంగా సరఫరా కాని మిషన్ భగీరథ నీరు

# వారానికి ఒకట్రెండు రోజులే..

- తాగునీటి కోసం అల్లాడుతున్న వికారాబాద్ జిల్లా ప్రజలు
- గత ఫిబ్రవరి నెల నుంచే తగ్గిన భూగర్భ జలాలు
- భగీరథ నీరు రాకపోవడంతో ఖాళీ బిందెలతో కిలోమీటర్ల దూరంలో ఉన్న బోరుబావుల వద్దకు మహిళల పరుగు
- 'మిషన్ భగీరథ'పై అధికారుల పర్యవేక్షణ కరువు
- ఇంట్రా విలేజ్‌తోపాటు గ్రిడ్ సమస్యలతో కష్టాలు
- ప్రజలు నీటి కోసం రోడ్డెక్కుతేనే స్పందిస్తున్న అధికారులు

జిల్లాలో తాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి. కేసీఆర్ పదేండ్ల పాలనలో తాగునీటి సమస్య లేకుండా మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లాల ద్వారా అందించగా.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మళ్లీ నీటి ఎద్దడి మొదలైంది. వారానికి ఒకట్రెండు రోజులే నీరు వస్తుండడంతో.. మహిళలు, ప్రజలు కిలోమీటర్ల మేర దూరంలో ఉన్న బోరు,బావుల వద్దకు నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి వచ్చింది.

-వికారాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ)




యాలాల మండల కేంద్రంలో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ప్రజలు

జిల్లాలో తాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి. గత రెండు, మూడు నెలలుగా నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. సుమారు రూ. వెయ్యి కోట్లు ఖర్చు చేసి ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకంపై ప్రస్తుత సర్కార్‌లో పర్యవేక్షణ కరువైంది. మిషన్ భగీరథకు సంబంధించి గ్రిడ్ లేదా ఇం ట్రా విలేజ్‌లో నీటి సరఫరా ఆగిపోయినా సంబంధిత అధికారులు స్పందించడం లేదు. ఇంట్రా విలేజ్‌లో భగీరథ నీరు రావడం లేదని ప్రజలు ఫిర్యాదు చేస్తే మాకు సంబంధం లేదని, పంచాయతీ అధికారులు చూసుకుంటారని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని ప్రజలు ఫిర్యాదు చేసి రోడ్డెక్కి ధర్నాలు చేసిన రెండు, మూడు రోజుల తర్వాత.. మిషన్ భగీరథ అధికారులు తీరిగ్గా వెళ్లి.. అక్కడ ఏ సమస్య లేదంటూ ఒకరిద్దరితో వీడియోలు తీయించి జిల్లా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అదే విధంగా ఇంట్రా విలేజ్‌కు నీటిని సరఫరా చేసే గ్రిడ్‌లోనూ లీకేజీలు ఏర్పడి మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నా పట్టించుకోవడం లేదు. కాగా, గతంలో ఐఏఎస్ అధికారి మిషన్ భగీరథ పథకాన్ని పర్యవేక్షించడంతో సక్రమంగా నీటి సరఫరా జరిగింది. ప్రస్తుతం ఏ అధికారి కూడా సక్రమంగా పర్యవేక్షించకపోవడంతో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. జిల్లాలో ఫిబ్రవరి నుంచే ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. ఓ వైపు మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోవడం, మరోవైపు భూగర్భజలాలు అడుగంటిపోవడంతో తాగునీటి సమస్యను తీర్చాలంటూ ప్రజలు రోడ్డెక్కుతున్నారు.





అర కిలోమీటర్ దూరంలో ఉన్న బోరు, బావుల నీటిని తెచ్చుకుంటున్న వికారాబాద్ మున్సిపల్ పరిధి, ఐదోవార్డు కొత్రేపల్లికి చెందిన మహిళలు

### ట్యాంకర్ల కోసం ఎదురుచూపులు

జిల్లాలో నీటికోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటర్ల మేర ఉన్న పొలాల్లోని బోరు, బావుల వద్దకు ఖాళీ బిందెలతో నడుచుకుంటూ వెళ్లడంతోపాటు ట్యాంకర్ల వద్ద నీటికోసం తోసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో ఎండల తీవ్రత పెరిగి 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయి. ఫిబ్రవరి నాటికి 13.58 మీటర్ల లోతుకు జిల్లాలో నీటి నిల్వలు తగ్గగా, మార్చిలో 14.53 మీటర్లకు, ఏప్రిల్ చివరి నాటికి 15 మీటర్లకుపైగా అడుగంటిపోయాయి. అయితే ఈనెలాఖరు వరకు జిల్లాలో భూగర్భజలాలు ఇంకా ప్రమాదకర స్థాయిలో తగ్గే ప్రమాదం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే బోర్లు, బావుల్లో నీటి నిల్వలు తగ్గిపోవడం, మరోవైపు మిషన్ భగీరథ నీటి సరఫరా వారానికి ఒకట్రెండు రోజులే వస్తుండడంతో జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో తాగునీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొన్నది. తండాలతోపాటు మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లోనూ తాగునీటి కోసం రోడ్డుపై ఇంటిల్లిపాది బిందెలు పట్టుకొని ట్యాంకర్లు ఎప్పుడు వస్తాయా..? అని ఎదురుచూస్తున్నారు.



### ఒక గల్లీకీ సరిపోవడం లేదు..

15, 20 రోజులకొకసారి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. ఇలా నీరు రాన ప్పుడు స్థానికులు నాలుగైదు రోజుల వరకు చాలా ఇబ్బంది పడుతున్నారు. బోర్లు పనిచేయడం లేదు. దాంతో ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తున్నది. అవి ఒక వైపు వస్తే మరో వైపు రావడంలేదు. ఓ గల్లీకి కూడా నీరు సరిపోవ డం లేదు. **మహమ్మద్ ఆరిఫ్, వాటర్ మన్, యాలాల గ్రామం, యాలాల**



### నాలుగు రోజులుగా రావడంలేదు..

నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదు. చాలా ఇబ్బంది అవుతున్నది. అసలే ఎండాకాలం.. ఎలా బతకాలో అర్థం కావడం లేదు. ఇట్ల తిప్పలు ఎప్పుడు పడలే. పైపులు పగిలిపోయానని అంటున్నారు. వాటిని త్వరగా బాగు చేయించొచ్చు కదా. **గొల్ల లక్ష్మమ్మ, యాలాల గ్రామం, యాలాల**

### కొత్రేపల్లిలో మూడు రోజులుగా రాని నీళ్లు..

వికారాబాద్ : తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఐదోవార్డు కొత్రేపల్లిలో గత మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదు. కాలనీకి నీటిని సరఫరా చేసే వాటర్‌మన్ గత నాలుగు రోజులుగా కనిపించకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. దీంతో అరకిలోమీటర్ దూరంలో ఉన్న బావి నుంచి నీటిని తోడుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఎలాంటి ఇబ్బంది లేదని.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ఈ సమస్య మొదలైందని పలువురు మండిపడుతున్నారు. తాము గత మూడు రోజులుగా అవస్థ పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.